

పట్నంలో మోస్తరు వర్షం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పగలు ఉష్ణోగ్రతలతో ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇబ్రహీంపట్నంలో బుధవారం సంత కావడంతో కూరగాయలు, ఇతర సామగ్రి తడిసి వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

చిన్నతూండ్లలో తాగునీటి కటకట



యాచారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న తూండ్లలో వారం రోజులుగా తాగునీటి కటకటతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ రావడం లేదని గ్రామస్తులు తెలిపారు. బోరు వాటర్ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు ఎక్కించి ప్రజలకు సరఫరా చేయాల్సి ఉండగా పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మహిళలు చెప్పారు. పంట పొలాల వద్ద బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ఫిల్టర్ వాటర్ రూ.5 వెచ్చించి క్యాన్ వాటర్ కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. ప్రతి బస్తీకి రోజుకు నాలుగు టాంకర్ల నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



స్వామినారాయణ్ పాఠశాలలో నారా భువనేశ్వరి

సంప్రదాయాలకనుగుణంగా విద్యనందించడం అభినందనీయం

- ఎన్టీఆర్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి
- స్వామినారాయణ్ ఇంటర్నేషనల్ స్కూల్ సందర్శన

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు17(ఆంధ్యజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యనందించడం అభినందనీయమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి తెలిపారు. బుధవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి పరిధిలోని వార్డులో ఉన్న స్వామినారాయణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను, హాస్టల్ బిల్డింగ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నో విద్యాసంస్థలు ఉన్నాయి కానీ స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాలలో అందిస్తున్న విద్య చాలా బాగుందన్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థుల నిబద్ధత, ప్రవర్తన బాగుందని చెప్పారు. భవిష్యత్తులో దేశరక్షణకు వీరు సిద్ధమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో సామాన్య ప్రజలు, కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ఆనాడు మూడు వేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యం ఏర్పడిందని, పది లక్షల ఎకరాలు భూములను భూస్వాములు, జాగీర్దార్ల నుంచి స్వాధీనం చేసుకుని పేదలకు పంచారంటూ వారు గుర్తు చేశారు. అలాంటిది తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందంటూ వారు ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కొన్ని పార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సామేల్, గణేష్, శ్రీకాంత్, వంశీ, తరంగ్, చరణ్ పాల్గొన్నారు.

తలసరి జీడీపీలో జిల్లా

నంబర్ వన్



అధికారంలోకి వచ్చిన గంటల్లోనే వాగ్ధానాల అమలు

ప్రజాపాలన దినోత్సవ వేడుకలను కొంగర్ కలాన్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల నుంచి గౌవర వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టర్ నారాయణరెడ్డి తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- అమరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం
- 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- రేడియల్ రోడ్ నిర్మాణానికీ ఆమోదం
- ప్రజాపాలన దినోత్సవంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తలసరి ఆదాయంలో జిల్లా అగ్రభాగంలో నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 2024-25 ఆర్థిక సర్వే ప్రకారం యావత్ దేశంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందంటే అది రాష్ట్ర ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతుందన్నారు. గుర్గా గ్రామ్ జీడీపీ 9.05 లక్షలు, బెంగుళూరు అర్బన్ 8.93 లక్షలు, గౌతమబుద్ధ నగర్/నోయిడా 8.40 లక్షలు, సంలేనా 8.10 లక్షలు, గోవా 7.63 లక్షలు, సిక్కిం 7.46 లక్షలు, దక్షిణ కన్నడ 6.69 లక్షలు, ముంబై 6.57 లక్షలు, అహ్మదాబాద్ 6.54 లక్షలు ఉండగా... అన్నింటికీ మించి 11.46 లక్షల జీడీపీతో రంగారెడ్డి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. అమరుల త్యాగాల ఫలితంగానే నాటి హైదరాబాద్ రాష్ట్రం, నేటి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిందని ఆయన తెలిపారు. నిరంతర పోరాటం ద్వారానే ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. అమరవీరుల త్యాగాల పునాదులపై నిర్మించబడిన

మిగతా 8వ పేజీలో...



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కార్యక్రమంలో అధికారులు



కలెక్టరేట్‌లో పోలీసుల గౌరవ వందన

రెండు దశల్లో మూసీ సుందరీకరణ

చారిత్రక మూసీ నది పునరుజ్జీవ లక్ష్యంగా రెండు దశలలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, బోటింగ్‌లతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి మూసీ సుందరీకరణ తోడ్పడుతుందన్నారు. 50 మీటర్ల మేర బఫర్ జోన్ అభివృద్ధికి దోహద పడడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, డీసీపీ సునీతారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్వో సంగీత, ఏవో సునీల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మెగా హెల్త్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వంద పడకల ఆస్పత్రి త్వరలో అందుబాటులోకి..

- హెచ్‌డీఎస్ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోగులకు మరింత నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు త్వరలో వంద పడకల ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.5.31 కోట్ల ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. సోమవారం కమ్యూనిటీ ఆస్పత్రిలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీలలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఆ శాఖ మంత్రితో మాట్లాడుతానన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులు, గర్భిణులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ నాగయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్దన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట స్టేజి సమీపంలోని పీవీ నర్సింహారావు ఆయుర్వేద పార్కు, స్వామి రామానంద తీర్థ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ సురభీవాణిదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ.మధుసూదన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్ మండలంలో రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రజల రవాణా సౌకర్యార్థం రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. హైదరాబాద్ బీజాపూర్ రహదారి నిర్మాణానికి న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నందున కొంత ఆలస్యం అవుతుందన్నారు. అవి పరిష్కారం కాగానే త్వరలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలను జిల్లాకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి నీరు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. రామానంద ఇనిస్టిట్యూట్‌లో ఔషధ మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ వాణిదేవి మాట్లాడుతూ.. అవసరాలకనుగుణంగా ఔషధ మొక్కలు నాటాలన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ వెంకటాపూర్ నుంచి చందానగర్ స్టేజీ వరకు రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ నర్సింహారావు తనయుడు ప్రభాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమ్ భరత్, షాబాద్ దర్శన్, సతీష్, మానయ్య, సత్యనారాయణ, రాంరెడ్డి, మహేందర్ ముదిరాజ్, జంగయ్య, శ్రీనివాస్, రవికుమార్, రాజు గౌడ్, ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



పీవీ నర్సింహారావు మెడిసిన్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే యాదయ్య, ఎమ్మెల్సీ సురభీ వాణీదేవి



అధికారులతో కలిసి మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటుకు చర్యలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- ఖానాపూర్, వెల్దండలో 50 ఎకరాల స్థలం పరిశీలన

ఆమనగల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు సీఎం రేవంత్, ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 252, 256లో ప్రభుత్వ భూములను వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు బుధవారం కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఎలుగొండ మధుసూదన్ రెడ్డిలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఆయా సర్వే నెంబర్లలో 38 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సమీపంలో మరో 12 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించాలని అధికారులకు కసిరెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు 50 ఎకరాల స్థలం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేంద్ర టెక్స్‌టైల్స్ , స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడైన నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి కల్వకుర్తి నియోజకవర్గంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి జయంత్‌సింగ్ చౌదరిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. వెల్దండ ప్రాంతంలోనూ కొన్నిచోట్ల భూములను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, నాయకులు యాదయ్య, సురేందర్ రెడ్డి, కృష్ణ, రవీందర్ నాయక్, చంద్రకుమార్, శంకర్ నాయక్, శేఖర్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే అందజేశారు. పలు గ్రామాల నాయకులు, ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు నిధుల మంజూరు గురించి ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఓం ప్రకాశ్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, జగన్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, హన్మనాయక్, బొజ్జ సాయిరెడ్డి ఉన్నారు.

రీజినల్ రింగ్‌రోడ్డుపై ఆందోళన వద్దు

- ప్రతిపాదనల దశలోనే ఉంది.. ఇంకా ఫైనల్ కాలేదు
- పేద రైతులకు నష్టం వాటిల్లకుండానే భూసేకరణ
- మీడియాతో కలెక్టర్ సి.నారాయణరెడ్డి



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రీజినల్ రింగు రోడ్డుపై వస్తున్న ప్రకటనలపై జిల్లా ప్రజలు, రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డు అంశం ప్రస్తుతం తెరపైకి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. రైతులను ఎవరూ తప్పుదారి పట్టించొద్దని సూచించారు. ప్రతిపాదనల దశలోనే రీజినల్ రింగ్‌రోడ్డు ఉందని, ఇంకా ఫైనల్ కాలేదన్నారు. సాధ్యమైనంత వరకు పేద రైతులకు నష్టం జరగకుండా చూస్తామని

మిగతా 8వ పేజీలో...

అప్పా జంక్షన్-మన్నెగూడ రోడ్డుకు తొలగనున్న అడ్డంకులు

తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డును రెండు వైపులా విస్తరణకు ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. అయితే రోడ్డుకు ఇరువైపులా ఏళ్ల నాటి మర్రి వృక్షాలను తొలగించాల్సి రావడంపై కొంతమంది పర్యావరణ వేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారని, ఇదే అంశంపై బన్యన్‌ట్రీ అనే స్వచ్ఛంద సంస్థ నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసును దాఖలు చేసినట్లు చెప్పారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు తాత్కాలికంగా నిలిచినట్లు, మనుషుల ప్రాణాల కంటే చెట్లు ఎక్కువేం కాదని, కానీ.. పర్యావరణ సమతుల్యత, పురాతన మర్రి చెట్ల ఉనికి దెబ్బతినకుండా మధ్యేమార్గంగా ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుందన్నారు. ఇప్పటికే రెడ్ మార్క్ వేసిన వృక్షాలు మినహా మిగిలిన వృక్షాలు సర్వీసు రోడ్డుకు, ప్రధాన క్యారేజ్‌వేకు మధ్యలో ఉండేలా రోడ్డులో స్వల్ప మార్పులు చేపట్టినట్లు, ఇదే అంశాన్ని పర్యావరణ వేత్తలకు వివరించి, కోర్టుకు కూడా ఓ సమగ్ర నివేదికను సమర్పించిందన్నారు. ట్రిబ్యునల్ కూడా ఇందుకు సుముఖత వ్యక్తం చేసేలా చూసిందని, రోడ్డు విస్తరణ పనులను ఓ కొలిక్కి వచ్చినట్లు, ఇప్పటికే మొయినాబాద్, చేవెళ్ల బైపాస్‌రోడ్డు పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు.



తెలంగాణలో వికసిస్తున్న కమలం

- స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం తథ్యం
- హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్
- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్

వివరాలు 7లో..

రాష్ట్రపతి ముర్మును కలిసిన బిక్కు నాయక్


ముర్ముకు వినతిపత్రం ఇస్తున్న బిక్కు నాయక్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి కుల రాజకీయాలు చేయాలని చేసే కుట్రల పట్ల లంబాడీలకు అన్యాయం జరగకుండా చూడాలని బీజేపీ గిరిజన మోర్చా జాతీయ కౌన్సిల్ సభ్యుడు నానావత్ బిక్కు నాయక్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఢిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కొందరు నాయకులు లంబాడీలు గిరిజనులు కారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్‌కు నిశాంత్‌రెడ్డి ఎంపిక


నిశాంత్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని ఐఐటీఎం డిగ్రీ కళాశాల విద్యార్థి కొంతం నిశాంత్‌రెడ్డి జిమ్నాస్టిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. తమిళనాడులోని సేలంలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి ఎరోబిక్స్, ఫిట్నెస్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నిశాంత్‌రెడ్డిని ప్రిన్సిపాల్ సురకంటి రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు సురకంటి పద్మారెడ్డి, కందకట్ల బాబుల్‌రెడ్డి, అధ్యాపకులు ఆయనకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

పారిశ్రామిక ప్రగతికి తార్కాణం విశ్వకర్మలు

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి


విశ్వకర్మ భగవాన్ జయంత్యుత్సవంలో కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత పారిశ్రామిక రంగ ప్రగతికి తార్కాణం విశ్వకర్మలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వకర్మ భగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను ఈవృత్తుల వారికి చేయూతనిస్తాయని ఆయన అన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు.కలెక్టరేట్ సముదాయం ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు - ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు.

నేటి నుంచి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా స్వచ్ఛతాహీ సేవ-2025 కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛతతో పల్లెలు మెరవాలని, అన్ని కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్వచ్ఛోత్సవ్ ఇతివృత్తంతో కార్యక్రమాలు సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లాలోని అన్నీ మండలాలు, అన్నీ గ్రామాలలో నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచాలన్నారు. స్వచ్ఛతపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, డీఆర్వో సంగీత, డీసీపీ సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురాం, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేష్ మోహన్, అదనపు పీడీ సుభాషిణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సీపీవో సామ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అగ్రస్థానంలో దేశం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్/చేవెళ్ల/మెయినాబాద్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ పాలనలో దేశం అగ్రగామిగా నిలిచిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా వికారాబాద్‌లోని ఆర్యవైశ్య భవనంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎంపీ మాట్లాడుతూ.. మోదీ పాలనాదక్షతతో ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూస్తున్నాయన్నారు. భారత్ అభివృద్ధి వైపు దూసుకుపోతుందన్నారు. శిబిరంలో బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు పాల్గొని రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. యువత మొత్తం మోదీ వెంటే ఉన్నారన్నారు. అలాగే చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళ-శక్తిమంతమైన కుటుంబం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరై రక్తదానం చేసిన వారికి ఎంపీ సర్టిఫికెట్లు, టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు.


రక్తదాతలకు పత్రాలను అందజేస్తున్న వడ్లనందు


రక్తదాన శిబిరంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, నాయకులు

ఇదిలా ఉంటే మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో బీజేపీ రంగారెడ్డి ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తపురం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. 200 మంది వరకు బీజేపీ శ్రేణులు రక్తదానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్, కంజర్ల ప్రకాష్, గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా కన్వీనర్ ఎల్లని వెంకటేష్ గౌడ్, డాక్టర్ వైభవ్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, డీడీఎంహెచ్‌వో నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ మహాయజ్ఞంలో ఎంపీ

చేవెళ్లలోని శ్రీ బ్రహ్మగిరి క్షేత్రంలో బుధవారం శ్రీగాయత్రీ విశ్వకర్మ మహాయజ్ఞ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. విశ్వకర్మ యువజన కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం విశ్వకర్మ భగవానుడిని చేవెళ్ల మండల కేంద్రంలో ఊరేగించారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నంతో పాటు బీజేపీ నాయకులు అనంతరెడ్డి, మాణిక్యరెడ్డి, శర్వలింగం, తదితరులు భగవానుడిని దర్శించుకున్నారు. విశ్వకర్మ సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాసచారి, శంభులింగం, వి. శ్రీనివాసచారి, బాలాచారి, లింగాచారి, మాణిక్యచారి, మోనాచారి పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

● మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అధైర్యపడవద్దు అండగా ఉంటామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. నాయకులను, కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, ఏ ఆపద వచ్చినా కుటుంబంలో ఒకరిగా చూసుకుంటుందన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో బుధవారం జైపాల్‌యాదవ్ పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నర్సింహ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, గోపాల్, వసంత, రమేశ్, బాలకృష్ణ, లింగం, జితేందర్ రెడ్డి, పవన్ తదితరులు ఉన్నారు.

స్కావెంజర్ల వేతనాల్లో స్కాంపై ఆరా

మహేశ్వరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకే ఆదర్శంగా నిలిచిన మహేశ్వరం ఆదర్శపాఠశాల.. కాంగ్రెస్ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చాక విద్యాబోధనలో వెనకబడడమే కాకుండా అవినీతి, అక్రమాల ఆరోపణలను ఎందుకు ఎదుర్కోవలసి వస్తుందని బీఆర్‌ఎస్ మహేశ్వరం మండలాధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ అన్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్లో స్కావెంజర్ల జీతాల్లో స్కాం జరిగిందనే ఆరోపణలపై ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వరం ఆదర్శపాఠశాలను సందర్శించి ఆరా తీశారు. ఇకనుంచైనా మంచి విద్యాబోధన జరగాలని, లేని పక్షంలో పాఠశాల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు. బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మోతీలాల్, కాడమోని ప్రభాకర్, దేవ్లానాయక్ పాల్గొన్నారు.

గౌడ సంఘం భవన నిర్మాణం చేపడతాం


ఎమ్మెల్యే, కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న గౌడ సంఘం నాయకులు

కులకచర్ల/పరిగి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పరిగిలో గౌడ సంఘం భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు పరిగి నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు కలిసి భవన నిర్మాణానికి సహకరించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిగిలో గౌడ సంఘం భవన నిర్మాణానికి స్థలంతో పాటు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పరిగి, దోమ, కులకచర్ల, గండీడ్, మొహ్మదాబాద్, పూడూర్ మండలాల సంఘం నాయకులు పాల్గొన్నారు.

గౌడ సంఘం తాలుకా అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్

పరిగి నియోజకవర్గం గౌడ సంఘం కమిటీని బుధవారం పరిగిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిగి తాలుకా అధ్యక్షుడిగా ఇంజమూరి రాజేందర్ ఎన్నికయ్యారు. కో-కన్వీనర్లుగా రాఘవేందర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. అలాగే పరిగి, కులకచర్ల, దోమ, మహమ్మదాబాద్, పూడూరు చౌడాపూర్ మండలాల బాధ్యులను ఎన్నుకున్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు

కడ్తాల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల నిర్మాణ పనులు నిలిపేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూనిర్వాసితులు స్పష్టం చేశారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి పచ్చటి పంట పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరాయి. దీక్షలో బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గంప శ్రీనివాస్, పాండు యాదవ్, చేగూరి రాములు, కందికంటి కేశవులు కూర్చున్నారు. తల్లోజు ఆచారి, గంప వెంకటేశ్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, కండె హరిప్రసాద్, తిప్పిరెడ్డి రాంరెడ్డి, దోనాదుల మహేశ్, పత్యానాయక్, కడారి రామకృష్ణలు సంఘీభావం తెలిపారు. పెంటారెడ్డి, గోరటి కృష్ణ, తదితరులు ఉన్నారు.

చిరుత సంచారంపై ఆరా తీస్తున్నాం

తాండూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తట్టేపల్లి శివారులో చిరుత ఆనవాళ్లు గుర్తించామని తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి తెలిపారు. సరిహద్దు ప్రాంతాలైన ఉద్దండాపూర్, సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లితండా, గుండ్లమడుగుతండా, మైసమ్మగడ్డతండా, ఆడ్కిచర్ల, పాషాపూర్, కర్ణాటకలోని కిష్టాపూర్, మిర్యాణ్, కల్లూరు, చందాపూర్, చించోళి ప్రాంతాల ప్రజలు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలన్నారు.

● బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

భూములు లాక్కుంటే ఊరుకోం

వికారాబాద్/మోమిన్‌పేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇష్టానుసారంగా రైతుల భూములను లాక్కుంటే ఊరుకునేది లేదని, చట్టప్రకారం వ్యవహరించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న టేకులపల్లి, దేవరంపల్లి, పులుసుమామిడి, పాతూరు గ్రామాల రైతులు వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఆయన రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూములను వదిలి ప్రైవేటు వ్యక్తుల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రీజనల్‌రింగ్ రోడ్డు భూ సేకరణలో కూడా కేంద్ర ఇచ్చిన అలైన్‌మెంట్ కాకుండా, సొంత డబ్బుతో కడుతున్నామని చెప్పి.. తమకు చెందినవారి భూములను కాపాడుకునేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. రింగ్ రోడ్డును సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భూముల మీదుగా తీసుకువెళ్లాలని, పేద ప్రజల భూములకు నష్టం జరుగకుండా చూడాలన్నారు. స్థానిక శాసనసభ్యులతో కలిసి స్పీకర్‌తో మాట్లాడతానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, నాయకులు గోపాల్, అనంత్ రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ నిర్మించాలి

యాచారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాత అలైన్‌మెంట్ ప్రకారమే ట్రిపుల్‌ఆర్ నిర్మాణం చేపట్టాలని, అలైన్‌మెంట్ మార్చితే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ అనుచరులు, ఎమ్మెల్యేల భూములు కాపాడేందుకు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం దారుణమని మండిపడ్డారు. బుధవారం అన్నెబోయినపల్లిలో ట్రిపుల్‌ఆర్ నిర్మాణం పాత అలైన్‌మెంట్ ప్రకారమే కొనసాగించాలని కోరుతూ బీఆర్‌ఎస్, సీపీఎం శ్రేణులు ఆందోళనకు దిగారు. దాంతో మాడ్గుల పోలీసులు వారిని అరెస్టు చేసి యాచారం పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ స్వార్థం కోసం అలైన్‌మెంట్‌ను మార్చి పేదలను రోడ్డున పడేస్తామనే ఆలోచన సరికాదని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాలయాపన చేయడంతో వేలాది మంది విద్యార్థులు చదువు అర్థాంతరంగా మానేస్తున్నారని అన్నారు. కాగా, ఇదే అంశంపై జైపాల్‌యాదవ్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఫోన్‌లో సంప్రదించి వివరించారు. రైతుల పక్షాన ఉద్యమించాలని, పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం మంచిదికాదని, రైతులకు అన్యాయం చేయడం సరికాదని కేటీఆర్ చెప్పినట్లు ఆయన వివరించారు.



వికారాబాద్ : రైతులతో మాట్లాడుతున్న కేటీఆర్

రైతులను వీధిన పడేస్తామంటే ఎలా?

పాత అలైన్‌మెంట్ ప్రకారంగా రోడ్డు నిర్మాణం చేపట్టకుండా ఇష్టానుసారంగా అలైన్‌మెంట్ మార్చి రైతులను వీధిన పడేస్తామంటే ఎలా అని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. రైతులకు న్యాయం చేసేదాకా పోరాటం కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు యాచారం పోలీస్ స్టేషన్ చేరుకొని బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులను, కార్యకర్తలను సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కె.రమేష్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు యాదయ్య, ఖాజొద్దీన్, వెంకటేష్, జగన్ తదితరులు ఉన్నారు.


ఘట్‌కేసర్ : టీచర్లకు జ్ఞాపికలు అందిస్తున్న కల్నల్ సీఎస్ రావు

దేశభద్రతలో భాగస్వాములవ్వాలి

ఘట్‌కేసర్ రూరల్/ఘట్‌కేసర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లు శక్తిసామర్థ్యాలను పెంపొందించుకొని దేశ భద్రతలో భాగస్వాములు కావాలని తెలంగాణ మహిళా ఎన్‌సీసీ 7వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సీఎస్ రావు ఆకాంక్షించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఆర్మీ కళాశాలను బుధవారం ఆయన సందర్శించి ఎన్‌సీసీ క్యాడెట్లతో ముచ్చటించారు. రావు మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరి రక్షణ రంగంలో ఉద్యోగాలు పొందాలని కోరారు. క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీలత, వైస్‌ప్రిన్సిపాల్ రమాదేవి, హవల్దార్ ముస్తఫా, ప్రతిభ, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, ఘట్‌కేసర్‌లోని జడ్పీహెచ్‌ఎస్(బాలికలు)లో ఎన్‌సీసీ నూతన యూనిట్‌ను సీఎస్ రావు ప్రారంభించారు. ఎంఈవో శ్రీధర్, హెచ్‌ఎంలు విజయ, పాపిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఆమనగల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా నిలుస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివా‌స్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, నాగులు, సతీష్, సుమన్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవలు అభినందనీయం

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్యజ్యోతి): 108 సిబ్బంది సేవలు అభినందనీయమని హిమాయత్ నగర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీది శ్రీను అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సంఘం ఆధ్వర్యంలో 108 సిబ్బందిని హిమాయత్ నగర్ చౌరస్తాలోని అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాల వద్ద సన్మానించారు. సంఘం ప్రధాన కార్యదర్శి పైలు శ్రీధర్, కట్టమీది ప్రకాశ్, షాబాద్ దర్శన్, బుర్రకాయల మహేష్ ముదిరాజ్, కంజర్ల శివయ్య, కట్టమీది రాకేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా శివప్ప

బషీరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం మండలాధ్యక్షుడిగా సత్య శివప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం బషీరాబాద్‌లోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-28 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పి.నర్సిరెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా కె.ప్రకాష్ వ్యవహరించారు. నూతన కమిటీలో అసోసియేట్ అధ్యక్షులుగా దశరథ్, ఉపాధ్యక్షులుగా హన్మంతు, ఉపాధ్యక్షురాలిగా లలిత, ప్రధాన కార్యదర్శిగా కె.మొగులప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.ప్రకాశం, ప్రచార కార్యదర్శిగా ఎ.సుభాష్, కోశాధికారిగా బి.రాములు, సంయుక్త కార్యదర్శిగా పి.శంకరమ్మలను ఎన్నుకొన్నారు.

డీఎల్పీవోగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

తాండూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాండూరు డీఎల్పీవోగా ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శంకర్‌నాయక్ నల్లగొండ జిల్లాకు బదిలీ కావడంతో పెద్దేముల్ ఎంపీవో రతన్‌సింగ్ కొన్ని నెలలుగా ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో ప్రవీణ్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది వెంకటయ్య, నర్సింహులు ఆయన్ను సన్మానించారు.


శామీర్‌పేట : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జైపాల్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శామీర్‌పేట/కొడంగల్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆర్టీఏ జిల్లా మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంఈవో కమలాకర్‌తో కలిసి శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందించారు. టీపీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు శామీర్‌పేట మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో శారద-జెడ్పీహెచ్‌ఎస్(తుర్కపల్లి), పద్మ-జెడ్పీహెచ్‌ఎస్(తూంకుంట), జ్యోతి-జెడ్పీహెచ్‌ఎస్(దేవరయాంజాల్), కవిత-ఎంపీపీఎస్(తుర్కపల్లి), శ్వేత-ఎంపీపీఎస్(అలియాబాద్), అరుణ్‌కుమార్-ఎంపీపీఎస్(మజీద్‌పూర్), భానుప్రకాష్-జెడీహెచ్‌ఎస్(లాల్‌గడిమలకోపేట), మురళి-ఎంపీపీఎస్ (సింగాయిపల్లి) ఉన్నారు. కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణ్, మోహన్‌బాబు పదోన్నతిపై బదిలీ అయ్యారు. వారిని గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం శరణు బసప్ప, ఉపాధ్యాయురాలు పూజిత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్ రాములమ్మ, కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శీను, జనార్దన్, శ్రీను, సయ్యద్, మహేష్ పాల్గొన్నారు.


శామీర్‌పేట : టీచర్లను సన్మానించిన జైపాల్‌రెడ్డి తదితరులు

ఉద్యమవీరుల జ్ఞాపకార్థం అమరవీరుల స్థూపం


నివాళులర్పిస్తున్న కోదండరాం, వీర్లపల్లి శంకర్ తదితరులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన ఉద్యమ వీరుల జ్ఞాపకార్థం అమర వీరుల స్థూపాన్ని నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట అమర వీరుల స్థూప నిర్మాణం కోసం బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కోదండరాం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ వీరుల జ్ఞాపకార్థం ప్రప్రథమంగా తాలుకా కేంద్రంలో అమర వీరుల స్థూపాన్ని నిర్మించడానికి ఎమ్మెల్యే ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ జనవరి 26నాటికి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు చాకలి ఐలమ్మ, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె. మదన్‌మోహన్ రెడ్డి, అగ్గనూరి విశ్వం, పి. వెంకట్‌రాంరెడ్డి, జేఏసీ నాయకులు జనార్దన్, టిజి శ్రీనివాస్, టి. కరుణాకర్, బాల్‌రాజ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల గోపాల్‌గుప్త, జి. బాల్‌రాజ్‌గౌడ్, ఏ. కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌డి ఇబ్రహీం, పి. శ్రీశైలంగౌడ్, సర్వర్‌పాషా, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషి అభినందనీయం: ఎమ్మెల్సీ

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అభినందనీయమని, చరిత్రలో నిలుస్తుందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. కళాశాల తుది రూప నమూనాను పరిశీలించి ఆనందించారు. భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న చెంది తిరుపతిరెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్‌లు భవన నమూనాను ఎమ్మెల్సీకి చూపించారు. అలాగే షాద్‌నగర్ పట్టణంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రజాపాలన దినోత్సవంగా కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ విమోచన దినోత్సవంగా బీజేపీలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ, మండల పరిషత్ కార్యాలయాలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుపై ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఏబీ కాంప్లెక్స్ ఎదుట సర్దార్ వల్లబాయ్‌పటేల్ చిత్రపటం పెట్టి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.

తెలంగాణలో వికసిస్తున్న కమలం

- స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం తథ్యం
- హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్
- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్

ఆమనగల్లు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కమలం వికసిస్తోందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అన్నివర్గాల ప్రజలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి తొలిసారిగా అచ్చంపేటకు వెళ్తున్న గువ్వల బాల్‌రాజ్‌కు ఎస్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కడ్తాల్, ఆమనగల్లులో ఘన స్వాగతం పలికారు. బీజేపీ మండలాధ్యక్షులు దోనాదుల మహేశ్, కర్నాటి విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీనుల ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆయా చోట్ల పెద్దఎత్తున స్వాగత తోరణాలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. కడ్తాల, ఆమనగల్లులో భారీ ర్యాలీలు నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని బాల్‌రాజ్ సందర్శించి మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీలో బాల్‌రాజ్, ఆచారి ప్రజలకు అభివాదం చేస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఆయా చోట్ల జరిగిన రోడ్ షోలలో బాల్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, బీఆర్‌ఎస్‌ను ప్రజలు విశ్వసించడం లేదని.. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రత్యమ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, మోదీ పాలనా దక్షతతో దేశం అద్భుత విజయాలు సాధిస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంపై కమలం జెండా ఎగురుతుందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లా, మండల నాయకులు కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ, లక్ష్మణ్, రాంపాల్ నాయక్, దుర్గయ్య, కృష్ణయాదవ్, చెన్నకేశవులు, శ్రీశైలం యాదవ్, రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీను, విష్ణు, కృష్ణ, కృష్ణనాయక్, జెనిగల గిరి, భగవాన్ రెడ్డి, నరేందర్, మల్లయ్య, సాయిలాల్ నాయక్, రాంరెడ్డి, శ్రీశైలం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్


కడ్తాలలో బాల్‌రాజ్‌ను గజమాలతో సత్కరిస్తున్న మహేశ్, బీజేపీ నాయకులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

పోషణ మాసోత్సవాలను విజయవంతంగా చేపట్టాలి

మేడ్చల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నిర్వహిస్తున్న 8వ జాతీయ పోషణ మాసం ఉత్సవాలను విజయవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. బుధవారం జిల్లాలో ప్రారంభించిన జాతీయ పోషణ మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అక్టోబరు 10 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేశారు. సామూహిక శ్రీమంతాలు, అక్షరభ్యాసాలు, అన్న ప్రసాన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించటంతో పాటు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ గార్డెన్‌లను ఏర్పాటు చేయాలని టీచర్లను ఆదేశించారు. అనంతరం పోషణ మాసం పోస్టర్‌ను విడుదల చేశారు. అంగన్ వాడీ టీచర్లకు న్యూట్రిషన్ గార్డెన్ విత్తనాలను అందజేశారు. జిల్లా వెల్ఫేర్ అధికారి శారద, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ లీజ్ హోల్డర్స్‌కు కండిషనల్ బెయిల్

బెయిల్ రద్దు చేసి కస్టడీ ఇవ్వాలని కోర్టును కోరుతున్న పోలీసులు

తాండూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సివిల్ సప్లయ్ శాఖ రైస్ మిల్లులకు సరఫరా చేసిన ధాన్యం పక్కదారి పట్టించిన సంఘటనపై రిమాండ్‌కు వెళ్లిన ఇద్దరు రైస్ మిల్లర్ లీజ్ హోల్డర్లు సంతోష్ కుమార్, చల్లా వెంకటేష్‌కు కోర్టు కండిషనల్ బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌పై విడుదలైన వీరికి కండిషన్ బెయిల్ రద్దు చేసి తమ కస్టడీకి ఇవ్వాలని యాలాల పోలీస్‌లు జిల్లా కోర్టును ఆశ్రయించారు. వరి ధాన్యాన్ని బియ్యంగా మిల్లింగ్ చేసి ఇచ్చేందుకు సివిల్ సప్లయ్ శాఖ కృష్ణాసాయి రైస్ ఇండస్ట్రీస్‌కు వరి ధాన్యాన్ని పంపిస్తే.. ఆ వరి ధాన్యం తాండూరులోని మరో ఐదు రైస్ మిల్లర్లకు విక్రయించడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కాగా, ఇందుకు సంబంధించి ఏ రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారనే విషయమై ఆరా తీస్తున్నారు. అయితే, మిల్లర్లు కొంతమంది మంగళవారం రాత్రి డీఎస్పీ కార్యాలయానికి వచ్చి డీఎస్పీతో గంటల తరబడి చర్చించారు. తమ పేర్లు ఎక్కడ బయట పడతాయోనని ఇతర రైస్ మిల్లర్లు ఆందోళనలో ఉన్నారు. అయితే, ఇతర మిల్లర్లకు ఇబ్బంది కలుగకుండా రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా నాయకులు పోలీసులు, అధికారులతో రాయబారం జరుపుతున్నారు.


మొక్క నాటుతున్న రాజేశ్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నాందర్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తేనే భవిష్యత్‌తరాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, మల్లన్న, నర్సిములు నాయుడు, దేశ్యానాయక్, మల్లికార్జున్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


తాండూరులో జరిగిన విశ్వకర్మ జయంత్యుత్సవాల్లో శాసన మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాండూరులోని కందనెల్లి వద్ద గల వీర బ్రహ్మేంద్రస్వామి గుట్టపై బుధవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శాసన మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేర్వేరుగా వేడుకల్లో పాల్గొన్నారు. ఇక్కడ అవసరమైన రోడ్డు, ప్రహరీ, భోజనశాల నిర్మాణంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని వారు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ కరుణం పురుషోత్తంరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు ఎం.శ్రీనివాస్, సర్దార్ ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస చారి, నాయకులు మహిపాల్‌రెడ్డి, మల్లేశం, కిరణ్, సంఘం నాయకులు పులేందర్ చారి, పాండురంగాచారీ, గడ్డె శ్రీనివాస్ చారి, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.


తాండూరులో నిర్వహించిన జయంతి వేడుకల్లో భాగంగా హోమం వద్ద పూర్ణాహుతిలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

చిరుధాన్యాల ఉత్పత్తుల శిక్షణను వినియోగించుకోవాలి

- ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి సిర్ల



వికారాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిర్మాణ్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఇస్తున్న చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి సిర్ల తెలిపారు. బుధవారం ఆమె వికారాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణ్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల మహిళల ఎదుగుదలకు తోడ్పడేలా చిరుధాన్యాలతో వివిధ రకాల ఆహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి మార్కెట్లో విక్రయించడానికి మద్దతుగా ఉండటంజరుగుతుందన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేస్తూ మార్కెట్ కమ్యూనికేషన్స్‌పై, వ్యాపార అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పరిధిలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలు వినియోగించుకోవాలని తెలిపారు. ఆసక్తిగల వివరాలకు ట్రైనర్ పవన్ కుమార్‌ను 9704003144 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.


మరమ్మతులు చేయిస్తున్న తక్కళ్లపల్లి గ్రామస్థులు

సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతులు

యాచారం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారి నుంచి తక్కళ్లపల్లి వెళ్లే రహదారిపై గుంతలుండడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులకు వివరించినా పట్టించుకోలేదు. దాంతో రెండు రోజులుగా తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కొందరు గ్రామస్థులు గడల మల్లేష్ ఆధ్వర్యంలో కంకర పోసి రోడ్డు చదును చేయించారు. గుంతల్లో కంకరపోసి బాగు చేస్తున్నారు. కాగా, ఈ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఏఎంసీ ఫోరం జనరల్ సెక్రటరీకి సన్మానం

బషీరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫోరం జనరల్ సెక్రటరీగా ఎన్నికైనా జి.మాధవరెడ్డి(ఏఎంసీ చైర్మన్ బషీరాబాద్)ని బుధవారం స్థానిక కార్యాలయంలో పాలకవర్గం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చందర్‌నాయక్, సభ్యులు కొవ్వూరు నరేష్, వాల్మీకి నరేష్, మోహన్, వడ్డే హన్మంతు, ఎస్.నరేష్, మూనీర్, అనూఫ్, ఎస్.వనమాల, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాధవరెడ్డిని సన్మానిస్తున్న వైస్ చైర్మన్, పాలకవర్గం సభ్యులు

వైభవంగా ప్రజాపాలన వేడుకలు

తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో విలీనమైన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ స్టేట్ ప్రజలు నిజాం పీడన నుంచి విముక్తి పొందారని నాయకులు అన్నారు. ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించింది. బీజేపీ నాయకులు తెలంగాణ విమోచనం పేరిట మూడు రంగుల జెండాను ఆవిష్కరించారు. అలాగే బీఆర్ఎస్ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించింది.


మంచాలలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో అధికారులు


కొత్తూర్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి


మహేశ్వరం: తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయం వద్ద జెండావిష్కరణ


చేవెళ్ల సొసైటీ కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరణ చేస్తున్న చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు


ఆమనగల్లు: ఏఎంసీ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ గీతనర్సింహ


కేశంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న అధికారులు, నాయకులు


శంకర్‌పల్లిలో జాతీయ జెండాను ఎగురవేసిన తహసీల్దార్ సురేందర్


తలకొండపల్లిలో ప్రజా పాలన వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి


యాచారంలో జెండావిష్కరిస్తున్న తహసీల్దార్ అయ్యప్ప


షాబాద్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో అపర్ణ


కొందుర్గులో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో


శంషాబాద్: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఎగరవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం


కడ్తాలలో జెండా వేడుకల్లో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్


ఆమనగల్లులో విమోచన దినోత్సవ వేడుకలో బీజేపీ నాయకులు

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

మంచాల/కొత్తూర్/కేశంపేట/శంకర్‌పల్లి/ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/యాచారం/షాబాద్/ చేవెళ్ల/మాడ్గుల/కొందుర్గు/మహేశ్వరం/షాద్‌నగర్ అర్బన్/కొందుర్గు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. స్వచ్ఛత, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానిగా దేశానికి మోదీ చేస్తున్న సేవలను కొనియాడారు. మంచాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీశైలం, రాజు, కె.జనార్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జంగయ్య, రాజుగౌడ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు. కొత్తూర్‌లో బీజేపీ మున్సిపల్, మండల శాఖ అధ్యక్షులు అమడపురం రణధీర్‌గౌడ్, అత్తపురం మహేందరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయకులు అమడపురం నర్సింహాగౌడ్, వెంకటేశ్‌గుప్తా, నాగరాజుచారి, మాణిక్యం, అరవింద్, రమేష్, శేఖర్ పాల్గొన్నారు. కేశంపేటలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక, నాయకులు నరసింహ, అంజయ్య, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నరసింహ, తిరుపతి, మహేష్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. శంకర్‌పల్లిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి జాతీయ జెండాను ఎగురవేసి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కాశీనాథ్, నర్సింహారెడ్డి, జయరాంరెడ్డి, అమరేందర్, నరేష్‌కుమార్, ప్రవీణ్‌రాజ్‌కుమార్, ఆనంద్ పాల్గొన్నారు. శంకర్‌పల్లిలోని డీఎంఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ప్రారంభించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో బీజేపీ, బీజేవైఎంల ఆధ్వర్యంలో మోదీ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ మండలాల అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, ఎర్రవోలు శ్రీను, దోనాదుల మహేశ్, రవిగౌడ్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే జి.బాల్‌రాజ్, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా, మండల నాయకులు కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ, లక్ష్మణ్, రాంపాల్, దుర్గయ్య, కృష్ణయాదవ్, చెన్నకేశవులు, శ్రీశైలం, రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీను, విష్ణు, కృష్ణ, కృష్ణనాయక్ పాల్గొన్నారు. యాచారంలో బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు రక్తదానం చేశారు. తాండ్ర రవీందర్, నాగటి యాదయ్య, శ్రీధర్‌రెడ్డి, కొండ మధుకర్‌రెడ్డి, జగదీష్, యాదగిరిరెడ్డి, జంగయ్యగౌడ్, కృష్ణ, రమేష్‌జీ, గంగల శ్రీశైలం పాల్గొన్నారు. అన్ని దేశాలు భారత్ వైపు చూసేలా మోదీ పాలన ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. షాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దూరి మాణయ్య, సేవ పక్వాడ కన్వీనర్ మహేశ్, కోకన్వీనర్ రవి, సందీప్, శ్రీధర్‌రెడ్డి, రాము, హరీష్, మహేందర్, శేఖర్, శ్రీశైలం, సురేష్, నారాయణ, విజయ్‌కుమార్, రాఘవేందర్, రమేష్, ఉపేందర్, శ్రీను, విష్ణు, శ్యామ్, నరేష్, నవీన్, రాజేష్, రాజు, వినయ్ పాల్గొన్నారు. నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా చేవెళ్లలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మోదీ పేరిట అర్చన చేయించారు. ఇంద్రసేన రెడ్డి, జైశంకర్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, వెంకటేశ్, మహేందర్, ఉమాశంకర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, గణేశ్, జైసింహ, నవీన్, రాకేష్, కరుణాకర్ పాల్గొన్నారు. మాడ్గులలో బీజేపీ నాయకులు కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు పండ్లు పంచారు. పార్టీ మండల అధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, దండు శ్రీనివాస్, శివరాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కాటం మధు తదితరులు పాల్గొన్నారు. నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. మహేశ్వరంలో బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లమల్ల యాదీష్ అధ్యక్షతన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శ్రీరాములుయాదవ్, పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, సుదర్శన్‌యాదవ్, మాధవచారి, యాదయ్యగౌడ్, దేశ్యానాయక్, రఘుపతి, రఘుగౌడ్, ప్రకాశ్, చింటు, అశోక్ పాల్గొన్నారు. రక్తదానం అన్ని దానాల కన్నా గొప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాఘవేందర్, షాయిద్, బీజేపీ నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మురళి, హరిభూషన్, ఋషికేశ్, వెంకటేష్, జె.నర్సింహ, విజయ్, శివ, రామకృష్ణ పాల్గొన్నారు. బీజేపీ కొందుర్గు మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రక్తదానం చేశారు. బల్వంతరెడ్డి, అశోక్, లింగం పాల్గొన్నారు.


మహేశ్వరంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, నాయకులు

తలసరి జీడీపీలో జిల్లా నంబర్ వన్

(ఐదో పేజీ తరువాయి)

తెలంగాణలో వారసత్వంగా వచ్చిన సంపదనను పరిరక్షించుకోవడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ముందున్న కర్తవ్యమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్ధానాలన్నింటినీ అమలులోకి తెచ్చిందన్నారు.

51,874 కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు

పదేళ్లుగా నిరీక్షిస్తున్న నిరుపేదలకు 51,874కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచి కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కోటీ 26లక్షల మంది రైతులకు నాలుగు విడతల్లో రూ.769.53కోట్ల రుణమాఫీ చేశామన్నారు. సంక్షేమ పథకాలతో జిల్లా ప్రజలు ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం గల నగరాలు..

రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్‌లను కలిపి ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానమైన నగరంగా రూపొందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందులో ఏఐ సిటీ, ఫార్మాసిటీ, లైఫ్ సైన్సెస్ హబ్‌లు, సూపర్ సిటీలు అంతర్భాగంగా ఉంటాయన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలకు జారీచేసే జీరో టికెట్ల సంఖ్య రూ.33.66 కోట్లు ఉండగా.. మహిళలకు ఆదా అయిన మొత్తం రూ.1,462కోట్లని తెలిపారు. రూ.500కు అందిస్తున్న సిలిండర్ పథకం కింద 2.11లక్షల కుటుంబాలకు 8.28లక్షల సిలిండర్లు సరఫరా చేయగా... వాటికి ప్రభుత్వం చెల్లించిన సబ్సిడీ రూ.24.79కోట్లు అని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద 3.25 లక్షల కుటుంబాలు లబ్ధి పొందగా, ప్రభుత్వం రూ.154.77కోట్ల సబ్సిడీ చెల్లించిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిమితి పెంచిన మీదట జిల్లాలో 70,336 మంది రోగులు ప్రయోజనం పొందగా.. రూ.177.86 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. వీటన్నింటికీ తోడు ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్ మహా నగరానికి ప్రత్యేక గుర్తింపు లభించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. అందులో భాగంగానే 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

రేడియల్ రోడ్ నిర్మాణానికి ఆమోదం

జిల్లాలో 41.5కిలోమీటర్ల దూరం రేడియల్ రోడ్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించిందన్నారు. రీజినల్ రింగ్ రోడ్‌తోపాటు ఔటర్ రింగ్ రోడ్‌ను కలిపేందుకు ఉద్దేశించబడిన రేడియల్ రోడ్డును(300 అడుగుల వెడల్పు) రూ.4వేల కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. పరిశ్రమలకు హబ్‌లకు మధ్య సురక్షిత ప్రయాణానికి ఇది దోహదపడుతుందన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డుపై ఆందోళన వద్దు

(ఐదో పేజీ తరువాయి)

ఆయన తెలిపారు. నగరంపై ఒత్తిడి తగ్గించేందుకు ఔటర్ మాదిరిగా మరో రింగు రోడ్డు అవసరం ఉందని, ప్రజలతో పాటు ప్రభుత్వం భావిస్తోందన్నారు. వాస్తవానికి రింగ్‌రోడ్డు ప్రభుత్వ ప్రతిపాదన మాత్రమే. ఎక్కడ నివాసాలున్నాయి? ఎక్కడ చెరువు ఉంది? ఎక్కడ బఫర్ జోన్ ఉంది? ఎక్కడ విల్లాలు ఉన్నాయో? స్పష్టత రాలేదన్నారు. రోడ్లు భవనాల శాఖ తుది రిపోర్టు తర్వాతే రెవెన్యూశాఖ భూసేకరణ ప్రక్రియను ప్రారంభం కానున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణంలో కొంతమంది త్యాగం చేయక తప్పదన్నారు. సాధ్యమైనంత వరకు చిన్న, సన్నకారు రైతులకు నష్టం జరగకుండా చూస్తామని, రైతులు అనవసరంగా ఆందోళన చెందరాదన్నారు. రెవెన్యూ సదస్సుల్లో భాగంగా 4 వేలకుపైగా అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి, బాధితులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయి నుంచి రిపోర్టులు తెప్పించుకుని వాటిని క్లియర్ చేసేందుకు యత్నిస్తున్నట్లు చెప్పారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పిదాలకు 'భూ భారతి'లో అవకాశం ఇవ్వడం లేదన్నారు. భూ భారతి పోర్టల్‌తో అన్ని సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందన్నారు. రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు అటు నుంచి ఆమనగల్ వరకు ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేయడమైందని, భూసేకరణ ప్రక్రియను కూడా పూర్తయ్యిందని చెప్పారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన కొంత మంది రైతులకు సంబంధించిన మొత్తాన్ని అథారిటీలో జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలాంటి సమస్య లేదని, టెండర్లు కూడా ఖరారైనట్లు, ఈ రోడ్డు నిర్మాణంతో మీర్‌ఖాన్‌పేట రూపురేఖలే పూర్తిగా మారబోతున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

పట్నంలో 'స్వచ్ఛతా హీ సేవా'

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హీ సేవా - 2025 ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం ఇబ్రహీంపట్నంలో మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి పాల్గొని మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కడ కూడా చెత్త, మురుగు నీరు నిల్వ ఉండకుండా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు,సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సీతారం అన్నారు. బుధవారం మండల కేంద్రం(కొత్తగూడ)లో ఉన్న కస్తూర్బా బధిరుల పాఠశాలలో అవగాహన సదస్సులో మాట్లాడారు. బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఫొటో మార్ఫింగ్ వంటి సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తీగల భార్గవి, ఇన్‌చార్జి విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భవానీ మాత ఆలయానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీ మాత ఆలయంలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు సామాజికవేత్త మందడి నరేందర్‌రెడ్డి 1.4లక్షల విరాళం ప్రకటించారు. ఆలయ చైర్మన్ రాజు బుధవారం ఆయనను కలిశారు.


భక్తి శ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

కొత్తూర్/కందుకూరు/ఆమనగల్లు/షాబాద్/షాద్‌నగర్ అర్బన్/మహేశ్వరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):కొత్తూర్, ఇన్ముల్‌నర్వల్లో విశ్వకర్మ జయంతిని వేడుకలను విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలశ రథాలతో ఊరేగింపు, హనుమాన్ ఆలయాల్లో పూజలు, హోమాలు నిర్వహించారు. కందుకూరు మండల విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కాసోజు ప్రశాంత్‌చారి సీతారామశాస్త్రి కల్యాణ మండపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణచారి, ఎస్.జంగాచారి, శివకుమార్, శివలింగాచారి, అనంతచారి, వీరాచారి, శంకరయ్యచారి, రమేష్‌చారి, సురేష్‌చారి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. ఆమనగల్లులో స్వర్ణకారులు భగవాన్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కాసోజు రాము పూజలు, హోమాలు నిర్వహించారు. చింతోజు రవికిరణ్, జగదీశ్వరచారి, శంకరాచారి, శ్రీనివాసచారి, రామాచారి, బ్రహ్మంచారి, సంతోష్, శ్రీను, లక్ష్మణ్, వెంకటాచారి, పరిపూర్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు. షాబాద్‌లో విశ్వకర్మలు మహాకాళి ఆలయంలో యజ్ఞం, హోమాలు, అనంతరం భగవానుడి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, బర్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొందూటి రవి ఆధ్వర్యంలో చేపట్టిన విశ్వకర్ముడి రథాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. శివమారుతి గీతా అయ్యప్ప ఆలయం నుంచి ఫరూఖ్‌నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం వరకు యాత్ర కొనసాగింది. అక్కడ పూజలు, యజ్ఞం నిర్వహించారు. షాద్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్లు నరేందర్, విశ్వం, సంఘం నాయకులు సుదర్శనచారి, సుధాకర్, గోవర్ధనచారి, మధుసూదనచారి, నర్సింహాచారి, గోపాల్‌చారి, జగదీష్‌చారి, మధు పాల్గొన్నారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు కుమారచారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న విశ్వకర్మ భగవాన్ ఆలయ ఆవరణలో యజ్ఞం నిర్వహించారు. వెంకటాచారి, శేఖర్‌చారి, బాలాచారి, కనకాచారి, మహేశ్, మల్లేష్, రాజ్‌కుమార్, నరేష్, వినేష్, శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌లో రథం ఊరేగింపులో ఎమ్మెల్యే శంకర్


షాబాద్‌లో నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వకర్మ శోభాయాత్రలో పాల్గొన్న విశ్వ బ్రాహ్మణులు

రజాకార్లపై పోరులో రాఘవాచారి పాత్ర మరువలేనిది


రాఘవాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన స్వాతంత్ర సమరయోధుడు రావినూతల రాఘవాచారిని స్మరిస్తూ బుధవారం దండుమైలారంలో గ్రామస్తులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రజాకార్లకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో జరిగిన ఉద్యమాన్ని ముందుండి నడిపించి ప్రాణత్యాగం చేసిన ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి సూచించారు. స్వస్థ్ నారీశక్తి పరివార్ అభియాన్‌ను పీహెచ్‌సీలో ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగేష్, సిబ్బంది అనసూయ, సరిత, జాన్సీ, మానస, ఉదయ్, రామునాయక్, స్టాఫ్‌నర్సులు పద్మ, మౌనిక, ప్రియ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సంక్షిప్తంగా...

● **శంషాబాద్ రూరల్:** శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బుధవారం 50మంది యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ హఫీజ్ మహ్మద్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ రాష్ట్రాల యాత్రికులు ఈ గ్రూపులో ఉన్నారని తెలిపారు.

● **కొందుర్గు:** మండల కేంద్రం శివారులో గోదావరి స్మెల్టర్స్ బ్యాటరీ కంపనీ నుంచి వెలువడుతున్న కాలుష్య పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డాటీ రాకేశ్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. కాలుష్య ప్రభావం పంటలపై పడుతోందని తెలిపారు. వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు పంటలను నష్టపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వెంకటయ్య, రామస్వామి, గోపాల్, కృష్ణ తదితరులు ఉన్నారు.

● **షాబాద్:** పెరియర్ రామస్వామి సేవలు చిరస్మరణీయమని టీజేఎస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ అన్నారు. పెరియర్ రామస్వామి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ద్రావిడర్ కళగం స్థాపించి, బ్రాహ్మణ ఆధిపత్యానికి, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మల్లేష్, శేఖర్, ప్రభాకర్, శ్రీను, వినయ్, బాల్‌రాజ్, నర్సింహులు పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రపంచ దేశాలు భారత్ వైపే చూస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. రాయపోల్, ఆదిబట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లిలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోదల శేఖర్‌రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ నియోకవర్గ కన్వీనర్ వన్నవాడ రవీందర్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ అధ్యక్షుడు గజ్జల నర్సింహారెడ్డిల అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో నాయకులు నర్సింహారెడ్డి, ప్రతాప్, దయానంద్‌గౌడ్, అర్జున్‌రెడ్డి, వై.నారాయణయాదవ్, శ్రీశైలం, అశోక్, శ్వేతశ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, రమేష్‌చారి, మధుకర్‌రెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.

● **కేశంపేట:** భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి వాటి పరిష్కారానికి నూతనంగా జీపీవోలను నియమించారని కేశంపేట మాజీ జెడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన జీపీవోలను బుధవారం తహసీల్దార్ కార్యాయంలో శాలువాలతో ఆమె సత్కరించారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ముచేయకుండా రైతులు, ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆజంఅలీ, సీనియర్ అసిస్టెంట్ మశ్చేందర్, జంగయ్య, సరస్వతి పాల్గొన్నారు.

● **యాచారం:** తెలంగాణ అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ అన్నారు. మాల్, కొత్తపల్లి గ్రామాల్లో తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ అమరులు కలలుగన్న రాష్ట్రం రాలేదని, భూస్వాముల తెలంగాణ అయ్యిందన్నారు.

● **కడ్తాల్:** మూడు నెలల వేతనాలు అందించాలని ఉపాధి హామీ పథక క్షేత్ర సహాయకులు కడ్తాల మండల పరిషత్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీవో లలిత, ఎంపీడీవో సుజాతలకు వినతిపత్రం అందజేశారు. నెలల కాలంగా వేతనాలు అందక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు అందించాలని కోరారు.

'కల్యాణలక్ష్మి' పేదలకు వరం

శంషాబాద్: కల్యాణలక్ష్మి పేదల కుటుంబాలకు వరం వంటిదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండల పరిధి 33మంది లబ్దిదారులకు మండల పరిషత్‌లో బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు లబ్ధిదారుల పాల్గొన్నారు.



క్రైం కార్నర్

గేదెల అపహరణ.. పోలీసులకు ఫిర్యాదు

మంచాల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దుండగులు పాడిగేదెలను అపహరించిన ఘటన మండల పరిధి లింగంపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. లింగంపల్లికి చెందిన బత్తుల చంద్రశేఖర్‌రెడ్డికి మందగూడ రోడ్డులోని తన పొలంలో గేదెలను షెడ్డులో కట్టేశాడు. మంగళవారం రాత్రి పాలు పితికి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం వచ్చే సరికి మూడు పాడిగేదెలు కనిపించలేదు. వెతికినా కన్పించలేదు. దీంతో గేదెలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఆదిభట్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని ఆర్‌జీకే కుర్మల్‌గూడలో ఓ వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ గృహకల్పలో ఉండే అహ్మద్ హుస్సేన్(23) మంగళవారం రాత్రి ఇంటికి వస్తున్న సమయంలో ఇంటి సమీపంలోని గ్రౌండ్‌లో తన తమ్ముడితో సల్మాన్ అనే వ్యక్తి గొడవ పడుతున్నాడు. ఎందుకు గొడవ పడుతున్నారని అడిగితే అతడిపై దాడిచేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదుతో సల్మాన్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.